క్లుప్తంగా

నెలాఖరు వరకూ సెక్షన్-30 పొడిగింపు

డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అమలాపురం డివిజన్‌లో ఇప్పటికే అమలులో ఉన్న సెక్షన్-30 పోలీస్ యాక్ట్‌ను ఈ నెలాఖరు వరకూ పొడిగించినట్లు డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ బుధవారం తెలిపారు. పోలీస్ సబ్ డివిజన్‌లో ముందస్తు అనుమతులు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ప్రదర్శనలు, నిరసనల వంటివి నిర్వహించేందుకు వీలు లేదని ఆయన స్పష్టం చేశారు. డివిజన్‌లోని అమలాపురం పట్టణం, అమలాపురం తాలూకా, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన పోలీస్‌స్టేషన్ల పరిధిలో సెక్షన్-30 అమలు వర్తిస్తుందని వివరించారు. ఈ విషయాన్ని డివిజన్ ప్రజలు గమనించి పోలీసులకు సహకరించాలని డీఎస్పీ అంబికా ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



విలసవిల్లిలో డయాలిసిస్ బాధితురాలికి పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి గ్రామానికి చెందిన డయాలసిస్ బాధితురాలు చింతలపూడి సుబ్బలక్ష్మికి మంజూరైన నూతన పింఛన్ రూ.10 వేలను సర్పంచ్ ఊర్మిళాదేవి బుధవారం ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కార్యదర్శి దాసరి కృష్ణాజీ, పుత్సల ఏసు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ ఔదార్యం

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి గ్రామానికి చెందిన ముదునూరి సుబ్బరాజు అనారోగ్యంతో అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఒకటో తేదీ కావడంతో పింఛన్ ఇవ్వడానికి ఆయన ఇంటికి వచ్చిన వలంటీర్ నందికం స్వామినాథ్ విషయం తెలుసుకుని నేరుగా అమలాపురంలోని ఆసుపత్రికి వెళ్లి సుబ్బరాజుకు వృద్ధాప్య పింఛన్ అందజేశాడు. వలంటీర్ స్వామినాథ్‌ని గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు అభినందించారు.

గృహ నిర్మాణాల్లో ఉపాధి పనిదినాలు కల్పించాలి

అల్లవరం: గృహ రుణాలు పొందిన లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకంలో పని దినాలు కల్పించాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఉపాధి కార్యాలయంలో ఉపాధి పనులపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించే దిశగా ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. మహిళా కూలీలకు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనుబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


నిరుపేదలకు దుప్పట్లు



నిరుపేదలకు నగదు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: స్థానిక లయన్స్‌క్లబ్ సభ్యుడు దివంగత వలీబాబు జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ హాలులో 100 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే ఇద్దరు మహిళలకు కుట్టుమిషన్లు, ఒక హార్ట్ పేషెంట్‌కు రూ.1.20 లక్షలు, ముగ్గురు డయాలసిస్ పేషెంట్లకు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున నగదు, కేన్సర్ పేషెంట్‌కు రూ.3 వేలు అందజేశారు. తాళ్లరేవు ఆస్పత్రిలో ఉమామనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు బాదం బాలకృష్ణ, వేలూరి సూర్యనారాయణ, రామరాజు, చోడే శ్రీనివాస్, వినోద్, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, నున్న దత్తు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ మృతి



చిట్టూరి సత్యనారాయణ(ఫైల్)

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరం పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చిట్టూరి సత్యనారాయణ(63) బుధవారం మృతి చెందారు. సత్యనారాయణ 2001 నుంచి 2006 వరకూ పి.మల్లవరం-2 ఎంపీటీసీ సభ్యునిగా సేవలందించారు. సత్యనారాయణ మృతికి ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, గ్రామ ఉపసర్పంచ్ పంపన రామకృష్ణ తదితరులు సంతాపం తెలియజేసారు.



అమలాపురంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పట్టణ వైశ్య సంఘం ప్రతినిధులు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు



బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సాంబమూర్తి

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

- ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు
- ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం



అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అజరామరమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, యేడిద శ్రీను పాల్గొన్నారు. పట్టణ వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలోని శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సర్క్యులర్ బజార్ ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ జంపన సుమన్ వర్మ, క్లబ్ అధ్యక్షుడు జీవీఎస్ మల్లిబాబులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమరజీవికి ఘన నివాళులు

అల్లవరం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు మహోన్నతుడని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ శేషగిరిరావు, ఎంపీడీఓ కృష్ణమోహన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి లక్ష్మణరావు, ఎంపీటీసీలు రాజేశ్వరి, ముత్తాబత్తుల రాంబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వై.సాంబమూర్తి పేర్కొన్నారు. బుధవారం స్థానిక బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మూలపురుషుడిగా నిలిచాడన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి సహాయం



బాధితుడికి నగదు అందజేస్తున్న వర్తకులు

యానాం: నియోజకవర్గ పరిధిలోని కాకివారి వీధిలో గత నెల 18వ తేదీన జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కాకి నాగేశ్వరరావు కుటుంబానికి బుధవారం యానాం వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేశారు. వర్తకులు, లిక్కర్ షాపుల అసోసియేషన్ ద్వారా సేకరించిన రూ.57 వేల నగదును బాధితుడు కాకి నాగేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో వర్తక సంఘ ప్రతినిధులు మాజేటి సత్యభాస్కర్, నల్లావెంకన్న, కాపగంటి గోపాలకృష్ణ, గాజుల బాబి, కాపగంటి జయబాబు, కాపగంటి తాజుద్దీన్, బ్రహ్మానందం పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

మామిడికుదురు: మహిళలు తమ నైపుణ్యం ద్వారా ఆర్థికంగా ప్రగతి సాధించాలని నాబార్డు ఏజీఎం వై.సోమునాయుడు అన్నారు. పాశర్లపూడిలో నాబార్డు సహకారంతో ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్‌ఈడీపీ ప్రోగ్రామ్‌లో భాగంగా మహిళలకు క్వాయర్ ఉత్పత్తులపై ఉచిత శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఏజీఎం మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలన్న లక్ష్యంతో వారికి ఉచితంగా క్వాయర్ ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈదరాడ, జనుపల్లి గ్రామాల్లో శిక్షణ కార్యక్రమం పూర్తయ్యిందన్నారు. పాశర్లపూడిలో కొత్తగా శిక్షణ ప్రారంభించామని చెప్పారు.

నష్టపరిహారం బ్యాంకు ఖాతాలకు జమ చేస్తాం



బలుసుతిప్పలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- బలుసుతిప్పలో గడప గడపకూ మన ప్రభుత్వం

కాట్రేనికోన: బ్రహ్మసమేధ్యం పంచాయతీ గోదావరి పాయలో ఓఎన్‌జీసీ పైపులైను పనులతో నష్టపోయిన లబ్ధిదారులకు నష్టపరిహారాన్ని ఈ నెల 21న వారి బ్యాంకు ఖాతాలకు జమచేస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యులు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. బ్రహ్మసమేధ్యం పంచాయతీ బలుసుతిప్పలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బలుసుతిప్ప గ్రామ ప్రజలు గడప గడపకూ విచ్చేసిన ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. మహిళలు ఇంటింటా మంగళ హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఓఎన్‌జీసీ ద్వారా అర్హత ఉన్న లబ్ధిదారులకు మూడు విడతలుగా నష్టపరిహారం చెల్లించామని, నాలుగో విడత సొమ్ము ఈ నెల 21న తాళ్లరేవు బహిరంగ సభలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం పాటు పడుతున్న జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేల కిషోర్, సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు, పాలెపు ధర్మారావు, కాటం సత్తిరాజు, నాతి సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి, సంసాని నాగేశ్వరరావు, తిరుమాని సత్తిబాబు, ఓలేటి సతీష్, ఇసుకపట్ల శ్రీనుబాబు, సంగాని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి పనులు

అంబాజీపేట: అడిగిన ప్రతి ఒక్కరీ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. బుధవారం వక్కలంక పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం గ్రామసభ ఫీల్డ్ అసిస్టెంట్ సకిలే చిరంజీవి అధ్యక్షతన నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి పథకంలో రైతులకు అవసరమైన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గ్రామస్తులు వాసంశెట్టి పెదబాబు, జనిపల్లి ఏడుకొండలు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, యల్లమిల్లి జయబాబు పాల్గొన్నారు.

యానాం అభివృద్ధికి పూర్తి సహకారమందిస్తాం



గౌరవ వందనం స్వీకరిస్తున్న పుదుచ్చేరి మంత్రి లక్ష్మీనారాయణ



పోలీసు దళాల మార్చ్‌ఫాస్ట్



ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

- పీడబ్ల్యూడీ శాఖ మంత్రి లక్ష్మీనారాయణ
- ఘనంగా విమోచన దినోత్సవ వేడుకలు

యానాం: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం అభివృద్ధికి పుదుచ్చేరి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పుదుచ్చేరి పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బాలయోగి స్టేడియంలో 70వ పుదుచ్చేరి విమోచనా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్, పుదుచ్చేరి ప్రతినిధి మల్లాడి కృష్ణారావులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానాం నియోజకవర్గంలో 4,600 మంది మహిళలను నెలకు రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించే పథకంలో చేర్చినట్లు తెలిపారు. అదేవిధంగా 136 మంది అప్పుడే జన్మించిన శిశువులకు రూ.50 వేల చొప్పున డిపాజిట్ చేశామన్నారు. ఓఎన్‌జీసీ పరిహారాన్ని మత్స్యకారులకు అతి త్వరలోనే అందించడానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. యానాంను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే చర్యల్లో భాగంగా ఫ్లవర్ షో, ప్రజా సాంస్కృతిక వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలుత వివిధ పోలీసు దళాల గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, మున్సిపల్ కమిషనర్ ప్రకాశం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పోలీసులకు, చిన్నారులకు బహుమతులు అందజేశారు.

విఘ్నేశ్వరునికి కలెక్టర్ పూజలు



విఘ్నేశ్వరస్వామి ఆలయంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, పాలకవర్గ సభ్యులు స్వాగతం పలికారు. స్వామివారి శేషవస్త్రాలతో కలెక్టర్ శుక్లాను ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు సత్కరించి స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

13 కిలోమీటర్ల మేర వాక్ మారథాన్



వాక్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ నాగేంద్ర

అమలాపురం టౌన్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమలాపురం వాకర్స్ క్లబ్ 13 కిలోమీటర్ల మేర వాక్ మారథాన్‌ను బుధవారం ఉదయం నిర్వహించింది. స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి వాకర్స్ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వాకర్స్ జిల్లా పీఆర్వో ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర వాక్ మారథాన్‌ను ప్రారంభించారు. అమలాపురం నుంచి అయినవిల్లి సిద్ధి వినాయక ఆలయం వరకూ మారథాన్ సాగింది. కార్యక్రమానికి జిల్లా ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, పుత్సా కృష్ణ కామేశ్వర్, వీవీ నాయుడు, రంకిరెడ్డి కాశి తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో ప్రజల ముంగిటకే వైద్యం



రోగులకు హెల్త్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం శిబిరాల ద్వారా ప్రజల ముంగిటకే వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక 25వ వార్డుకు సంబంధించి మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని వార్డు సచివాలయం వద్ద బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ప్రారంభించి ప్రసంగించారు. దాదాపు 350 మంది శిబిరంలో వైద్య సేవలు పొందారు. అనంతరం అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్ దొంగ నాగ సుధారాణి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్లు నాగవరపు వెంకటేశ్వరరావు, చిత్రపు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మెరుగైన వైద్యం

ముమ్మిడివరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ జి.లోవరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించిందన్నారు. 14, 15, 16 వార్డులకు చెందిన 380 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్, సరిపెల్ల రామకృష్ణంరాజు, మాదాల నాగ సత్య మంగాకుమారి, వాడపల్లి అచ్యుత రామరాజు, లచ్చిరాజు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అన్నారు. సమనస ఉన్నత పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం వారు ప్రారంభించి అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, సర్పంచ్ పరమట శ్యామ్‌కుమార్, ఈవోపీఆర్డీ గుబ్బల మల్లిఖార్జునరావు, కార్పొరేషన్ డైరెక్టర్ కరేళ్ల రమేష్, ఎంపీటీసీ ఉడుము రామకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యులు ముసలి స్వర్ణనరాజు, కార్యదర్శి శ్రీనివాస్, మామిడిపల్లి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని సమనస గ్రామం వన్నెచింతలపూడి హైస్కూల్లో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి జనం పోటెత్తారు. కంటి పరీక్షలు చేయించుకునేందుకు రోగులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత శిబిరాన్ని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ ప్రారంభించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లిఖార్జునరావు, మామిళ్ళపల్లి ఫణికుమార్, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్



సమనస శిబిరంలో వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీహరిరామ్‌గోపాల్



సమనస శిబిరంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సంస్కృతి ఉత్సవ్ ప్రచార పత్రికల విడుదల



సంస్కృతి ఉత్సవ్ ప్రచార పత్రికలను విడుదల చేస్తున్న న్యాయవాది మల్లపరాజు తదితరులు

అమలాపురం టౌన్: వచ్చే నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ నిర్వహించనున్న 18వ భారతీయ సంస్కృతి ఉత్సవ్-23 పోటీల ప్రచార పత్రికలను బుధవారం స్థానిక కూచిమంచి వారి వీధిలో సీనియర్ న్యాయవాది కూచిమంచి మల్లపరాజు, ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధ కొండ విడుదల చేశారు. ఈ ఉత్సవ్‌లో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ విద్యార్థులకు ఏకాపాత్రాభినయం, చిత్రలేఖనం, విచిత్ర వేషధారణ, ఇతిహాసం, భగవద్గీత తదితర అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ ఆకొండి పవన్ తెలిపారు. ఆన్‌లైన్ పోటీల ఎంట్రీలకు ఈ నెల 27వ తేదీ ఆఖరి తేదీగా నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు వరద మల్లిబాబు, ఈవని విశ్వేశ్వరశర్మ, దేవపూజ్యుల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మాదిగల సభకు తరలిరావాలి

ఉప్పలగుప్తం: ఈ నెల 11న హైదరాబాద్‌లో జరిగే మాదిగల సభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ సత్తాల దుర్గారావు పిలుపునిచ్చారు. మండలంలోని నంగవరం గ్రామంలో విశ్వరూప కరపత్రం బుధవారం విడుదల చేశారు. కార్యక్రమంలో పలివెల రాంబాబు, లంక సత్యనారాయణ, వంగలపూడి గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

మామిడికుదురు: నగరం గ్రామంలో జాలెం తాతరమేష్ ఆధ్వర్యంలో బుధవారం 20 మంది యువకులు రక్తదానం చేశారు. అమలాపురానికి చెందిన బుద్దాల నాగబాబు మెమోరియల్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో యువకుల నుంచి రక్తం సేకరించారు. రక్తదానం చేసిన యువకులకు బ్లడ్ బ్యాంకు ప్రశంసా పత్రాలను అందించింది. నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి, జాలెం రాంబాబు, కొల్లాబత్తుల జతిన్, నల్లి కుమార్, పల్లి రాజేష్ పాల్గొన్నారు.

శబరిమలైకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

రావులపాలెం: రావులపాలెం, పరిసర గ్రామాల నుంచి శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తులకు అద్దె ప్రాతిపదికన వారు కోరిన రూట్లలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ బుధవారం తెలిపారు. ఐదు రోజుల యాత్ర కాణిపాకం, శ్రీపురం, భవాని, ఎరుమేళి, పంబ, తిరుపతి, విజయవాడ, రావులపాలెం ఉంటున్నారు. దీనికి టిక్కెట్ ధర రూ.5 వేలు అన్నారు. ఆరు రోజుల యాత్ర కాణిపాకం, పళణి, గురు వాయూరు, ఎరుమేళి, పంబ, తిరుపతి, విజయవాడ టిక్కెట్ ధర రూ.5,500గా నిర్ణయించామన్నారు. ఏడు రోజుల యాత్ర శ్రీశైలం, మహానంది, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పంబ, పళని, శ్రీరంగం, కంచి, తిరుపతి, విజయవాడ టిక్కెట్ రూ.6 వేలుగా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎనమిది రోజుల యాత్ర కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, గురువాయూర్, ఎరుమేళి, పంబ, మధురై, రామేశ్వరం, శ్రీరంగం, కంచి, తిరుపతి, విజయవాడ, రావులపాలెంకు టిక్కెట్ ధర రూ.6500గా పెట్టామన్నారు. తొలి రోజుల టూర్‌కు టికెట్ రూ.7 వేలు అన్నారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ 73829 11871 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.